రైతుకు యంత్రసదుపాయం..!

◆ యాంత్రీకరణకు మార్గదర్శకాలు

◆ ఈనెల 26లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వ్యవసాయ యంత్రీకరణ పరికరాల పంపిణీకి మార్గం సుగగమైంది. వెంటనే వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను సబ్సిడీతో రైతులకు అందివ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పంపిణీ ప్రక్రియ మొత్తాన్ని మార్చి 16వ తేదీలోపు పూర్తిచేయాలని సూచించింది. ఈ మేరకు అనంతపురం జిల్లాకు 1661 యూనిట్లు మంజూరు చేశారు. ఇందుకు రూ.2.86 కోట్ల నిధులు కేటాయించారు.

మార్గదర్శకాలు

గడిచిన ఐదు సంవత్సరాల్లో లబ్ధిపొందని రైతులై ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా ఎస్సీ,ఎస్టీ, మహిళా, చిన్నకారు రైతులకే 50 శాతం సబ్సిడీతో వీటిని అందివ్వనున్నారు. దీంతోపాటు విధిగా ఈ-పంటలో నమోదయి ఉండాలి. కుటుంబంలో ఒక్కరికే అర్హత ఉండనుంది. ట్రాక్టర్‌కు సంబంధించిన పనుముట్లు కావలంటే విధిగా రైతుకు ట్రాక్టర్ కలిగుండాలి.

దరఖాస్తు ఇలా..

ఈ పథకం కింద లబ్ధిపొందాలంటే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి. వ్యవసాయ సహాయ సంచాలకులు అప్రూవల్ ఇచ్చిన తరువాతనే లబ్ధిదారులు తమ వాట డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం పర్చేజ్ ఆర్డర్‌ను పొందిన తరువాత ఆగ్రోస్ సంస్థ తయారీ సంస్థలకు అప్పగించి వారి ద్వారా లబ్ధిదారులకు అందజేస్తారు. 5వ తేదీన గ్రామాల్లో వీటి వివరాలు తెలియజేయనున్నారు.

పంపిణీ చేయనున్న పరికాలు ఇలా...

వ్యవసాయ యంత్రీకరణ కింద పంపిణీ చేయాలని నిర్ణయించిన పరికరాలు ఈ విధంగానున్నాయి. క్నాప్‌సాప్ స్ప్రేయర్లు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్, రొటోవేటర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం కలిపి 1661 యూనిట్లు మంజూరు చేశారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

సబ్సిడీతో అందివ్వనున్న యంత్రీకరణ పరికరాలను పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేసి అందజేస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ఉమామహేశ్వరమ్మ జిల్లా సంయుక్త సంచాలకులు, అనంతపురం.

నాడు జై.. నేడు నై..!

◆ ఆప్కాస్ రద్దుతో ఉద్యోగ భద్రత కోల్పోతున్న కార్మికులు

◆ పొరుగు సేవలను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం

◆ ఆందోళనలకు సిద్ధమవుతున్న కార్మికులు

ఏజెన్సీలకు అప్పగించొద్దంటూ పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి హిందూపురం

సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లపై పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు వైసిపి అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి వారు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతు తెలిపారు. కార్మికుల ఆందోళనలో న్యాయం ఉందని, తాము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హిందూపురంలో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో సినీ నటుడు, స్థానిక ఎమ్మెల్యే, నందమూరి బాలకష్ణ పాల్గొని మద్దతు తెలిపారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు కార్మికులకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున గళం విప్పిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే నోరుమెదపడం లేదు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలతో పాటు వివిధ కార్యాలయాల్లో పొరుగు సేవలు అందిస్తున్న కార్మికులందరి పొట్ట కొట్టడానికి సిద్ధమయ్యే నిర్ణయాలు తీసుకునేలా అడుగులు వేస్తోంది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రోడ్డున పడేసేలా కార్పొరేషన్‌ను తొలగించి ఏజెన్సీల ద్వార వేతనాలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శ్రీ సత్య సాయి జిల్లాలో 1100, అనంతపురం జిల్లాలో 3000 మంది వరకు కార్మికులు ఆప్కాస్ కార్పొరేషన్ నుంచి జీతాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరంతా తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రవేటు ఏజెన్సీల ద్వారా నిర్వహించే వారు. జీతాలు వారికి ఇస్తే, వారు కార్మికులకు చెల్లించే పరిస్థితులుండేవి. ఇందుకోసం జీతంలో ఒక్క శాతం ఏజెన్సీ తీసుకుటుంది. కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, జీఎస్టీలను ఏజెన్సీలు చెల్లించాలి. గతంలో ఏజెన్సీల చెల్లించకుండా దోపిడీ చేశాయి. వైసిపి ప్రభుత్వ సమయంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, అప్కాస్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఏజెన్సీలను తొలగించి అందరినీ దీని కింద చేర్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు సుమారు 5000 మందిని ఆప్కాస్ కింద చేర్చారు. నాలుగు శ్లాబ్ల కింద జీతాలు చెల్లిస్తున్నారు. రూ.12 వేలు, రూ.15వేలు, రూ.18,500, రూ.21,500 జీతాలు ఇస్తున్నారు. ప్రతి నెలా కాకుండా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన సమయంలో మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి చెప్పి పాత పద్ధతిలోనే ఏజెన్సీలకు వేతనాలు చెల్లింపు కాంట్రాక్ట్ బాధ్యతలను ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఈ విధానంలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ మరోసారి దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉంది.

కార్మికులకు మోసం

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిని పక్కన పెట్టి ఆసలకే మోసం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదు. కనీసం రూ.27 వేలు ఇవ్వాలని ప్రభుత్వ సిఫార్సు ఉంది. దీనిని అమలు చేయమని మాత్రమే కార్మికులు అడుగుతున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకు వీధులు చిమ్మడం, డ్రైయినేజీ పూడికలు తీయడం, ఇలా అన్ని పనులను చేస్తున్నారు. ఇంత శారీరక కష్టం పడుతోన్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదు. ఇదే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవుట్ సొర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులున్నారు. వీరి పరిస్థితి అలానే ఉంది. అప్కాస్ కార్పొరేషన్ ద్వారానైనా పూర్తి జీతం చేతికొచ్చి, పిఎఫ్, ఇఎస్ఐ, జీఎస్టీ చెల్లిస్తోన్న సమయంలో ప్రభుత్వం ఏజెన్సీలకు లింకుపెట్టడాన్ని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాపితంగా కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమెండ్ చేస్తున్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు కార్మికులు సిద్దం అవుతున్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చిన బాలయ్యకు వినతిని ఇస్తున్న కార్మికులు (ఫైల్ ఫోటో)

వైసిపి హయాంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫోటో)

విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ నాయకులు

మంత్రి వ్యాఖ్యలు అనుచితం : యుటిఎఫ్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

యుటిఎఫ్‌పై మంత్రి అచ్చెం నాయుడు చేసిన వ్యాఖ్యలు అనుచితమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెనాయుడు యుటిఎఫ్‌కు వైసిపి ముసుగువేస్తూ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వాస్తవానికి ఎపిటిఎఫ్, పిఆర్‌టియు అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు. కూటమి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అని ఇప్పటికైనా గ్రహించాలని కోరారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని దానికి యుటియఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని వారు గుర్తు చేసారు. యుటిఎఫ్ ఏ అధికార, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉండదన్నారు, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే సంస్థ యుటిఎఫ్ అని అన్నారు. యుటిఎఫ్‌కు రాజకీయాలు అంటగట్టడం సరికాదని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం పట్టణ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు హరికష్ణ, సాయి గణేష్, మునిసిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లె రామాంజినేయులు, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, ఎచ్, రామాంజనేయులు, హరిశంకర్, ప్రదీప్ కుమార్, వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి : సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆశావర్కర్లు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ రెహనాకి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఒప్పందాలపై జీవోలు ఇవ్వాలని పని బారాన్ని తగ్గించాలని ,ప్రభుత్వ సెలవులు ,రిటైర్మెంట్ ,గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్లు అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావల్లి, ఆశావర్కర్లు యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, తులసి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తలుపుల :ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, 2024 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు ,రిటైర్మెంట్ ,గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం 6వ తేదీన తలపెట్టిన చలో విజయవాడకు ఆశ వర్కర్లు తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఆశా వర్కర్ల సమస్యలపై వినతి పత్రాన్ని మెడికల్ ఆఫీసర్ అల్తాఫ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ, మండల కన్వీనర్ బాషా, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, నాగేశ్వరమ్మ, రాధా, హుస్సేన్‌బీ ,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని జమ్మల బండ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆగ్రామ మహిళలకు ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపైకి వచ్చి ప్రధాన రహదారిపై బైటాయించి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంతో విధిలేని పరిస్థితిలో ఆందోళనకు దిగామన్నారు. గ్రామంలోని యాదవ కాలనీకి తాగునీటి సౌకర్యం కోసం రెండు బోర్లు వేయగా ఒక బోరులో మోటార్ చెడిపోయిందన్నారు. మరొక బోరు, శ్రీరామ రెడ్డి తాగునీటి పథకం ద్వారా వచ్చే నీటిని వదిలేవారన్నారు. కాలనీవాసులు ఇష్టానుసారంగా అక్రమ కొళాయిలు అమర్చుకోవడంతో కాలనీకి తాగునీటి సరఫరా సరిగా లేక నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణానందచారి జమ్మల బండ గ్రామానికి చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మూడు రోజుల్లోపు మీ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పిస్తామనిహామీ ఇచ్చారు.దీంతో మహిళలు గ్రామస్తులు ధర్నాను విరమించారు.

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని శ్రీ కంఠపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. 8వ వార్డులో రోడ్డు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గిరి, టీడీపీ నాయకులు నవీన్, వెంకటేష్, లింగప్ప, మిత్ర వాటర్ ప్లాంట్ నిర్వాహకులు లక్ష్మీ నారాయణ, మున్సిపల్ డిఇఇ వాణి, ఎఇ ధీరజ్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు .దీంతో బుధవారం ఉదయం పదకొండు గంటలకు ఆయన స్వగ్రామమైన వరిగిరెడ్డిపల్లి లో స్థుపావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ సభకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ , సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు, సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి నల్లప్ప హాజరవుతారు. ఈ కార్యక్రమానికి పార్టీ సభ్యులు, వామపక్ష సానుభూతిపరులు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం కదిరి పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు కోరారు.

నిర్లక్ష్య వైద్యురాలిపై చర్యలకు డిమాండ్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు మృతురాలి బంధువుల ఆందోళన

మెడికల్ సూపరింటెండెంట్ లింగన్నకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు. తన భార్య ప్రీతి (25) మృతికి వైద్యులే కారణమని ఆరోపిస్తూ మృతురాలి భర్త హరి, బంధువులు మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంటెంట్ ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త హరి, అత్త కాంతమ్మ, గాయత్రి మాట్లాడుతూ పట్టణంలోని సూరప్ప కట్ట ప్రాంతంలో నివాసముంటున్న తాము ప్రీతిని. రెండవ కాన్పు కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చామన్నారు. పరీక్షలను నిర్వహించిన వైద్యురాలు రక్తం తక్కువ ఉండడంతో పాటు బిపి అధికంగా ఉందని, బిపి అదుపులోకి వచ్చిన అనంతరం ప్రసవం చేద్దామని తెలిపిందని చెప్పారు. బీపీ అదుపులోకి వచ్చి, రక్తం అందించిన అనంతరం ఈనెల 1వ తేదీన సిజేరియన్ చేసి మగ బిడ్డను బయటకు తీశారన్నారు. ఆ సమయంలో గర్భసంచికి కుట్లు సక్రమంగా వేయక పోవడం వల్ల ఆపరేషన్ చేసిన గంటకే అధిక రక్త స్రావం కావడంతో 9 పాయింట్లు ఉన్న రక్తం 3.5 కు పడిపోయిందన్నారు. ఈ విషయం వైద్యురాలికి చెప్పినా ఆమె వచ్చి చూడకుండా ఫోన్ లో నర్సులకు సూచనలు చేశారని, వైద్యురాలు సూచించిన మేరకు నర్సులు చికిత్స చేసినప్పటికీ రక్తస్రావం తగ్గలేదని అన్నారు. అనంతరం వైద్యురాలు నీరజ ఆసుపత్రికి వచ్చి పరిస్థితి చూసి బాధితురాలు షాక్ గురై డిఐసిలోకి వెళ్లిందని, ప్లేట్ లెట్స్ కౌంట్ పడిపోయిందని అనంతపురం తీసుకెళ్లాలని రెఫర్ చేశారని తెలిపారు. 108 అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ అంబులెన్స్ లో అక్కడికి తీసుకెళ్లామన్నారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి గర్భసంచికి కుట్లు సక్రమంగా వేయకపోవటంతో ఈ విధంగా జరిగిందని వైద్యులు చెప్పారన్నారు. చికిత్స పొందుతు ప్రీతి మృతిచెందిందని వాపోయారు. ప్రీతి మృతికి హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులే కారణమని ఆరోపించారు. వైద్యురాలు నీరజ ఆపరేషన్ థియేటర్లో ఇతర వ్యక్తులను అనుమతించిందని, అది ఎవరో తేల్చాలని అన్నారు. అధిక రక్తస్రావం అవుతున్నప్పటికీ అనంతపురం ఎందుకు రెఫర్ చేయాల్సి వచ్చిందో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై తమకు న్యాయం జరగకపోతే ఎంతటి వరకైనా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంపై మెడికల్ సూపరిడెంటెంట్ లింగన్న స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

ఎస్సీ జెడ్ భూములను రైతులకు తిరిగివ్వాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పరిగి

ఎస్సీ జెడ్ పేరుతో రైతుల నుండి భూములు తీసుకున్న ప్రభుత్వం తిరిగి రైతులకు ఆ భూములను అప్పజెప్పాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తహాశీల్దార్ హాసీనసుల్తానాకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తీసుకున్న భూముల్లో 18 సంవత్సరాల అయినప్పటికీ కనీసం మౌలిక వసతులు కల్పించకపోగా సాగు చేసుకుంటున్నా రైతులకు ప్రభుత్వ పథకాలు కల్పించకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే భూములు ఇచ్చిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలు , వలసలు అరికట్టాలన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర , బీమా సౌకర్యం కల్పించాలన్నారు, ఎస్సీ జెడ్ పేరుతో సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయని ప్రాంతాలలో భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని,రైతుల ప్రోత్సాహక బకాయిలు రూ. 72 కోట్లు వెంటనే విడుదల చేసి రైతుల అకౌంట్లలోకి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు వీరేష్, సిపిఎం నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆడపిల్లలను రక్షిద్దాం

ప్రజాశక్తి-ఓబులదేవర చెరువు

ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దామని ఐసిడిఎస్ పిడీ వరలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక షాదీ మహల్లో ఓడిసి, నల్లమాడ, అముదగూరు సెక్టార్ల అంగన్వాడి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలపై జరిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సాధించే అవకాశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్, వర్మ, సూపర్వైజర్లు విజయ కుమారి, సత్యవతి, గంగాదేవి, బ్లాక్ కోఆర్డినేటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

పెండింగ్లో ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యల గురించి తహశీల్దార్ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే రీ సర్వే పనులను కూడా వేగవంతంగా నిర్వహించాలన్నారు ఇంటింటా జరుగుతున్న పీపుల్ సర్వే ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బత్తల హరి విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

మండలంలోని బూరగపల్లి గ్రామంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవర ఎద్దు వేలుకు కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు బత్తల హరి విరాళం అందజేశారు. తనవంతుగా 15 వేల రూపాయలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, అంజి, నర్సింహులు, ఎద్దుల హరి, సూరిచిన కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

మాదకద్రవ్యాల నివారణ కోసం పౌరులందరూ ఐక్యంగా కృషి చేద్దామని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్డిజిఎస్ కళాశాలలో నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సస్ అండ్ నార్కోటిక్స్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ అంశంపై ఒక్కరోజు సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి, నాసిన్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్లు శివ కుమార్ అయ్యర్, శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసలయి వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నానాటికి ఈ సమస్య సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంటూ దేశ అభివృద్ధికి, సమగ్రతకు, సమైక్యతకు అడ్డంకిగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డిజిఎస్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. నాగేంద్ర కుమార్, డిగ్రీ ప్రిన్సిపల్ జెఎస్వీఎస్ ప్రసాద్, హెచ్ఒడి అనిల్ కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో అక్రమాలకు తావు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలలో అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ వెంకటేష్కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో ఓపెన్ టెన్త్ పరీక్షా కేంద్రాల్లో కొందరు కోఆర్డినేటర్లు, సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై డబ్బులు తీసుకుని అక్రమాలకు పాల్పడేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యల వల్ల కష్టపడి చదువుకున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. తక్షణమే ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసి, పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భగత్, గణేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

14న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు : చిలకం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఈ నెల 14 వ తేదీన పీఠాపురం,చిత్రాడలో జరగబోయే జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి కోరారు. మంగళవారం ధర్మవరం పట్టణంలోని జనసేన పార్టీ నూతన కార్యాలయంలో హిందూపురం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల జనసేన పార్టీ ఇన్ఛార్జులు, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు,జిల్లా కమిటీ సభ్యులు,వీర మహిళలు, ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిలకం మాట్లాడుతూ జనసేన పార్టీ గురించి దేశవ్యాప్తంగా చర్చించుకునే విధంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేసి పిఠాపురానికి తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు శ్రీనివాసులు, తాడిమర్రి మోహన్, బత్తలపల్లి మండల నాయకులు ప్రకాష్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ సరుకు రవాణా రైలు ప్రారంభం

డబుల్ డెక్కర్ రైలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెనుకొండ

కియా ఇండియా పెనుకొండ రైల్వే స్టేషన్ నుంచి ఎస్యువిలను రవాణా చేయడానికి భారతదేశపు మొట్టమొదటి డబుల్ డెక్కర్ సరుకు రవాణా రైలును రైల్వే శాఖ మంగళవారం ప్రారంభించింది. ఈసందర్భంగా కియా ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ హర్దీప్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ ఎస్యువిలకోసం భారతదేశం మొట్టమొదటి డబుల్ డెక్కర్ సరుకు రవాణా రైలును ప్రారంభించడంతో దేశ రవాణా మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంలో ముందడుగు వేసిందన్నారు. ఈ సౌకర్యంతో కార్ల కోసం వేచి ఉండే సమయం తగ్గుతుందని వినియోగదారులకు వేగంగా ఎస్యువిలను అందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ అధునిక పర్యావరణ అనుకూలమైన లాజిస్టిక్స్ పరిష్కారం తమ వార్షిక వృద్ధి లక్ష్యాలను చేరుకోవటానికి పురోగతిని వేగవంతం చేయడానికి సహాయపడుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు. కియా రైల్వే నెట్వర్క్ ద్వారా 60వేల ఎస్యువిలను దేశంలోని ఉత్తర, తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు రవాణా చేస్తోందని ఆయన వివరించారు. డబుల్ డెక్కర్ రైలు 264 కార్ల రవాణా సామర్థ్యం ఉందన్నారు. ప్రామాణిక రైలు సామర్థ్యం కంటే రెండున్నర రెట్లు ఎక్కువ అన్నారు. భారతదేశంలో.విస్తరిస్తున్న ఆటోమోటివ్ పరిశ్రమ పెరుగుతున్న డిమాండ్ను తీర్చబోతోందన్నారు. ఈ సంచలనాత్మక చొరవ ఆటో తయారీదారులు లాజిస్టిక్స్ ప్రొవైడర్ల కోసం కార్యకలాపాలను క్రమబద్ధీకరిస్తోందన్నారు.

ఫ్రీ కాట్ పరిశ్రమ మూసివేత ప్రయత్నం ఆపాలి : సిఐటియు

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, తదితరులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలో కార్మికుల జీవనోపాధికి ఎంత ఉపయోగకరంగా మారిన ఫ్రీ కాట్ మిల్ మూసివేసేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని ఈ ప్రయత్నాన్ని ఆపాలని ఫ్రీ కాట్ మిల్ సిఐటియు యూనియన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, కార్యదర్శి జెడ్పీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రీకాట్ లిమిటెడ్ యాజమాన్యం సంస్థను స్థాపించి 42 సంవత్సరాలు అయిందన్నారు. నూలు దారం వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తూ అనేక అనుబంధ సంస్థలు స్థాపించిందన్నారు. ఈ స్పిన్నింగ్ పరిశ్రమలో కార్మికులు ప్రారంభ దశలో వెయ్యిమంది రోజు వేతనం తో పనిచేశారన్నారు. రాష్ట్రంలో కరెంటు చార్జీలు అధికంగా ఉండటం, రియల్ ధరలు ఎక్కువగా ఉండటం తదితర కారణాలతో కార్మికులకు గానీ ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సంస్థను మూసివేయాలని ప్రయత్నించడం అన్యాయమన్నారు. కార్మిక వ్యతిరేక నిర్ణయాన్ని యాజమాన్యం తీసుకోవడం యూనియన్ గా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం వెంటనే యాజమాన్యంతో చర్చించి మూసివేత నిర్ణయాన్ని ఆపాలని లేని పక్షంలో కార్మికులందరిని కలుపుకొని పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేశారు.

బకాయి వేతనాలు మంజూరు చేయాలి: సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలను వెంటనే మంజూరు చేయించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక తహశీల్దార్ వెంకటేశుకు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు బకాయి పడ్డ వేతనాలను అందజేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ కార్యాలయం ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ వికార్ రాము కార్మికులకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. శ్రీరామి రెడ్డి తాగునీటి పథకం కార్మికులకు గత 11 నెలల నుండి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. సమస్యను రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మాయమాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత నెల క్రితం కార్మికులు సమ్మెలోకి పోవడానికి సిద్ధమై పంపుసెట్లు, మోటార్స్ ఆఫ్ చేస్తుండగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు జోక్యం చేసుకొని మార్చి 3వ తేదీ లోపు వేతనాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. అలా ప్రభుత్వం ఇవ్వకపోతే తన సొంత నిధులతో వేతనాలు ఇస్తానని చెప్పి ప్రస్తుతం దాటవేసే ధోరణితో మాట్లాడడం సరికాదని అన్నారు. సంవత్సరాలు కొద్ది వేతనాలు రాకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని కార్మికులకు బకాయి ఉన్న 11 నెలల వేతనాలను వారి ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇతర ప్రజా సంఘాలను, కార్మికులను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ కార్యదర్శి నాగేంద్ర, అధ్యక్షులు సోము, ఉపాధ్యక్షులు మురళి, కోశాధికారి రామాంజి, సంయుక్త కార్యదర్శి మంజునాథ్, కమిటీ సభ్యులు జబీ, మల్లికార్జున, సుధ, సోమయ్య, నారాయణప్ప, సుభాష్, గిరీష్, మహానంద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'పది' పరీక్షలు : ఆర్జెడి

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని కడప ఆర్జెడి శ్యాముల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాలలో పదవ తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, మండల విద్యాశాఖ అధికారులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జెడి మాట్లాడుతూ పరీక్షలలో విద్యార్థుల ధోరణికి అనుగుణంగా వ్యవహరించాలని పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకుని, పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులపైనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, డైట్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఏడీ రామకృష్ణ, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యలో రాణించాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

చదువులో రాణిస్తేనే మహిళలకు సమాజంలో సముచిత స్థానం లభిస్తుందని ఐసిడిఎస్ సిడిపిఒ జయంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవార ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ వర్కర్ల సమావేశంతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఖాజీ రఫీమున్నీసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక సర్పంచి పంచరత్నమ్మ అధ్యక్షత వహించగా సీడీపీవో జయంతి, ఈవోపీఆర్డీ శకుంతల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరన్నారు. అనంతరం ఉత్తమ సర్పంచ్ గా జాతీయ స్థాయి అవార్డు అందుకున్న నల్లచెరువు సర్పంచి పంచరత్నమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పద్మావతి, జయమ్మ, లక్ష్మీదేవి, ఎపిఎం రమణప్ప, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట మండలాల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'నష్టపరిహారం కాజేసేందుకు కుట్ర'

కోర్టు కాపీని చూపుతున్న బాధితులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

గ్రీన్ఫీల్డ్ హైవే కోసం సేకరించిన భూములకు సంబంధించి నష్టపరిహార విషయంలో కోర్టు వివాదంలో ఉన్న నష్టపరిహారాన్ని కాజేసేందుకు కొందరు కుట్ర పన్నారని బాధిత రైతులు వాపోతున్నారు. గ్రీన్ పీల్డ్ హైవే కోసం సేకరించిన భూములలో కొన్ని తగాదాల భూములు ఉన్నాయి. వీటిలో చాగలేరు పొలానికి చెందిన సర్వేనెంబర్ 111-2, 112-2, 126-2 లకు సంబందించి మొత్తం 7-40 సెంట్లు భూమి ఎన్ హెచ్ 544 - జికోసం సేకరణ చేశారు.ఇందుకు సంబందించి మొత్తం 46,48,165 రూపాయలు నష్టపరిహారం మంజూరు కావల్సి ఉండగా ఆ భూమి కి సంబందించి కోర్టులో సివిల్ కేసు నడుస్తుంది. ఈ విషయమై రెవెన్యూ రికార్డులలో ఈ సర్వే నెంబర్ ని వివాదాస్పద జాబితాలో చేర్చి తహశీల్దార్ లాగ్ ఇన్ లో లాక్ చేసి ఉంచారు. అయితే ఇటివలే ఆ సర్వే నెంబర్ని అల్ లాక్ చేయడం పట్ల బాదితులు సురేంద్రనాథ్ రెడ్డి ,శ్రీనివాసురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో ఉన్న భూ వివాదానికి సంబందించి జడ్జిమెంట్ వచ్చే వరకు సర్వే నెంబర్ ని అన్ లాక్ చేయొద్దని డీటీ జగన్నాథ్ ను వారు కోరారు. ఆ భూమిపై వచ్చే నష్టపరిహారాన్ని కాజేసుందుకు ఓ రెవెన్యూ అధికారి సహకారంతో సర్వేనెంబర్ ని అన్ లాక్ చేశారని ఆరోపించారు. విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెల్లి సమస్య పరిష్కారం చేస్తానని డీటీ జగన్నాథ్ అన్నారు.

భూ అక్రమాలపై ఐఎఎస్ అధికారితో విచారణ చేయించాలి

స్థానికులతో మాట్లాడుతున్న సిపిఐ నేత రామకృష్ణ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండాలో గిరిజన భూములు కబ్జా విషయంలో ఐఎఎస్ అధికారితో విచారణ చేయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆ గ్రామానికి చేరుకొని గ్రామం నడిబొడ్డున రచ్చబండ దగ్గర భూములు కోల్పోయిన ఆ రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ముదిగుబ్బ మండల అధ్యక్షులు గోడ్డుమరి ఆదినారాయణ యాదవ్ గిరిజనుల కు చెందాల్సిన 200 ఎకరాల భూమిని కబ్జా చేశారని గిరిజనులు వాపోయారు. తమ తాతల కాలం నుంచి ఉన్న భూములను తమకు ఇప్పించి న్యాయం చేయాలని అడవి బ్రాహ్మణపల్లి తండా రైతులు రామకృష్ణను కోరారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలు అమాయకులైన గిరిజనులకు సంబంధించిన రెండు వందల ఎకరాల భూమిని ముదిగుబ్బ మండల అధ్యక్షులు గోడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ తమ కుటుంబీకుల పేరు మీదుగా ఆన్లైన్లో ఎక్కించుకుని ఆ భూముల మీద బ్యాంకులో రుణాలను కూడా తీసుకున్నారన్నారు. ఈ భూములు నిరుపేదలవి వారి భూములు వారికే చెందాలని అన్నారు. ఇక్కడ జరుగుతున్న భూ అక్రమాలను ఏడవ తేదీ సత్యసాయి జిల్లా ఇన్ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అయిన అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. అలాగే ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ భూ అక్రమాలపై ఐఎఎస్ అధికారితో విచారణ చేపట్టి పేదల భూమి పేదలకే చెందేలా చేయాలన్నారు. పేదలకు చెందాల్సిన ఈ భూములు పేదలకు చెందే వరకు తమ పోరాటం ఆగదని రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం చేస్తామని ఆయన అన్నారు, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవసాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప ,రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, ధర్మవరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్ కుమార్, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి మహదేవప్ప , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులతో పాటు ముదిగుబ్బ నాయకులు డాబా రామకృష్ణ, గంగిరెడ్డిపల్లి నాయుడు, చల్లా శంకర, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అన్లైన్లో 200 ఎకరాలు ఉన్నట్లు తేలితే దళితులకు సిపిఐ సమక్షంలోనే పంచుతా : ఎంపిపి

ఆన్లైన్లో 200 ఎకరాలు ఉన్నట్లు తేలితే సిపిఐ ఆధ్వర్యంలో దళితులకు ఆ భూములు పంచుతానని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అన్నారు. మండలం బండ్లపల్లి కొట్టాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. తనకు సంబంధం లేని భూ వివాదాల్లోకి తన పేరును తెస్తున్నారని వాపోయారు. దళితులు ఎవరైనా సాగులో ఉంటే వారి పేర్ల మీద చేయించేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు.

రైతు సమస్యలపై తహశీల్దార్కు వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రైతు సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్కు మారుతికి అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టురైతుల ప్రోత్సాహక బకాయిలు విడుదల చేయాలని, వ్యవసాయ మోటార్లకు ట్రాన్స్ఫార్మర్ల ధరలు తగ్గించాలని కోరారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించి 50 శాతం సబ్సిడీతో దానా అందించాలని ప్రతి లీటరుకు పది రూపాయలు ప్రభుత్వ ప్రోత్సాహంగా అందించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి అన్ని చెరువులకు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు విజయ భాస్కర్, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు రాజగోపాల్, లక్ష్మి నారాయణ, రామాంజి నేయులు, క్రిష్టప్ప, రామకృష్ణ, శ్రీనివాసులు, రైతులు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని దేవి రెడ్డి పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచారు.మంగళవారం సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి మదియా, ఏడవ తరగతి విద్యార్థి సుస్మిత కార్డ్ బార్డర్స్ డిస్ప్లే రోబోను తయారు చేశారు.ఏడవ తరగతి చదువుతున్న సుస్మిత స్మార్ట్ స్మోక్ అలర్ట్ ప్రాయికాట్ ఎస్ క్రో ఫైవ్ యాక్సిడెంట్స్ స్టేషన్ అలెర్ట్ బజ్జెర్ యంత్రాన్ని ప్రదర్శించిన విధానం ఆకట్టుకుంది.9వ తరగతి చదువుతున్న భరత్, షయాన్ అనే విద్యార్థులు వాహనాలలో జరిగే ప్రమాదాలను నివారించడానికి స్మార్ట్ ఆల్కహాలిక్ సెన్సార్ డేట్ అఫ్ యంత్రాన్ని తయారుచేసి ప్రదర్శించారు. అంతేకాకుండా పాఠశాలలోని అటత ల్యాబ్ ను ఉపయోగించుకొని విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణా ప్రతాప్ నాయక్, ఒకేషనల్ ఉపాధ్యాయురాలు సల్మా,ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి గ్రామానికి చెందిన యువకుడు సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివారల మేరకు గ్రామానికి చెందిన షేక్ జిలాన్ సాబ్ కొడుకు షేక్ మహబూబ్ బాషా (30) కదిరి రోడ్ లో పాన్ షాప్ పెట్టుకుని జీవనం చేసేవాడు. రెండు సంవత్సరాలుగా మద్యానికి బాసిన అయ్యాడు. మద్యం తాగి వస్తుండడంతో ఆయన భార్య, తల్లిదండ్రులు అతడిని మందలించే వారు. రంజాన్ నెల ప్రారంభమైన తర్వాత కూడా మద్యం తాగి ఇంటికి వస్తుంటే భార్య, తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో మహబూబ్బాషా సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అలాగే ఇంటిలోకి వెళ్లిన మహబూబ్బాషా కిటికీకి ఉన్న ఇనుప కడ్డీలకు వేసి ఉన్న ఉయ్యాల చీరకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు మహబూబ్ బాషాను ఉరి నుండి తప్పించి బత్తలపల్లి ఆర్డిటి తీసుసుకువెళ్లారు. అయితే అప్పటికే మహబూబ్బాషా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య షేక్ భాను బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సోమశేఖర మూర్తి తెలిపారు.

ధర్మవరంలో మహిళ...

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన లక్ష్మీదేవి(34) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈమె గర్భకోశ వ్యాధితో బాధపడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో లక్ష్మి దేవి మనస్థాపానికి గురై, కేతిరెడ్డి కాలనీ సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మీదేవి ధర్మవరం మునిసిపాలిటీ నందు కాంట్రాక్ట్ స్వీపర్ గా పనిచేస్తుండేదని స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

హిందూపురంలో వ్యక్తి ...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని దేవరపల్లి కి చెందిన కేజీ అంజినప్ప (60) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా అంజినప్ప కుటుంబ సభ్యులకు దూరంగా పక్కనే ఉన్న మల్బరీ షెడ్ లో నివాసం ఉండేవాడు. ఒంటరితనం భరించలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు పట్టాలు దాటుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వేస్టేషన్ లో రైలు పట్టాలను దాటే క్రమంలో పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన ఇంద్రనాథ్ గుప్త (52) అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ లో మంగళవారం సాయంత్రం ప్లాట్ ఫారం మారే క్రమంలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ఢీకొనడంతో ఇంద్రనాథ్ గుప్త అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పోచనపల్లి నుండి హిందూపురానికి వెళ్లే రహదారిలో పెన్నా నది బ్రిడ్జి వద్ద మంగళవారం దాడులు నిర్వహించి చాకలి కుంటకు చెందిన రాకేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనంలో తీసుకువెళుతున్న 1059 టెట్రాప్యాకెట్లు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, సతీష్, వెంకటేష్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, సురేష్, సుధాకరెడ్డి, శివ కుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎస్పీ రత్న ఆదేశాల మేరకు కదిరి డీఎస్పీ ఆధ్వర్యంలో కదిరి రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు సమీపాన పేకాట స్థావరంపై తమ సిబ్బందితో కలసి మంగళవారం దాడులు నిర్వహించారు. లక్ష రూపాయల నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ చెప్పారు. పేకాట ఆడుతున్న వెంకట రమణ , సుకుమార్, నాగేంద్ర, గంగన్న, రామూర్తి, శివను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రమణా రెడ్డి, ఎఎస్ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని హిరేతూర్పి ఎస్సీ కాలనీ సమీపంలో గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రాజ కుల్లయప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన పక్కా సమాచారంతో తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. హిరేతుర్పి, చిగతూర్పి, దాసరపల్లి గ్రామాలకు చెందిన నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.51వేల నగదు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈదాడుల్లో ఎస్ఐతో పాటు ఎఎస్ఐ రమణ, కానిస్టేబుళ్లనాగేష్, మహమ్మద్ రఫీ, జగన్నాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై కుక్క దాడి

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని బీదానపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిచ్చ కుక్కగా ఇద్దరు చిన్నారులపై దాడి చేసింది. గ్రామానికి చెందిన నవి, మహానంద అనే మూడు సంవత్సరాల పిల్లలపై దాడి చేసి గాయపరిచింది. దీంతో వారిద్దరిని రొద్దం ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వచ్చి టీకాలు వేయించారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డ్ చెన్నప్ప కుటుంబానికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేశారు. కొత్తచెరువు మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన చెన్నప్ప 2024 జులై 15న అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ హోంగార్డ్ వెల్ఫేర్ ఫండ్ కింద రూ, 15వేల విలువ జేసే చెక్కును చెన్నప్ప భార్య చంద్రకళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వలి, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా రెస్టారెంట్ నిర్వహణ

నోటీసు జారీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలో సర్వే నెంబర్. 333-9ఎలో ఓబుళపురం గ్రామం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా నింబస్ ఆగ్రో ఫామ్స్ పేరుతో వ్యవసాయ భూమి ని వ్యవసాయేతర భూమిగా ఉపయోగిస్తున్నందున తహశీల్దార్ సౌజన్యలక్ష్మి నోటీసులు జారీ చేశారు. నిర్వాహకులకు నాన్ అగ్రికల్చర్ యాక్ట్ -2006 మేరకు నోటీసులు జారీ చేసినట్లు తహశీల్దార్ చెప్పారు. పార్మ్ హౌస్ల పేరుతో రెస్టారెంట్ నిర్వహిస్తున్నందును తహసీల్దార్ తనిఖీ చేసి నోటీసులు అందజేశారు.

కలప అక్రమ తరలింపును అరికట్టాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ వ్యాప్తంగా వాల్టా చట్టాన్ని ధిక్కరించి ప్రతిరోజు కొన్ని వేల చెట్లను ఇష్టానుసారం నరికేస్తున్నారని పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు అన్నారు. కలప అక్రమ తరలింపును ఆపాలని కోరుతూ ఆర్డీవో మహేష్కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుంచి పలువురు ఎటువంటి అనుమతులు లేకుండా కలపను ఇటుక బట్టీలకు, సామిల్లకు, పక్క రాష్ట్రాలకు లెక్కలేని తనంతో తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి పకృతిని కాపాడాలని కోరారు.